ప్రజాశక్తి
శనివారం 25 మార్చి 2023
5
శ్రీకాకుళం





మాట్లాడుతున్న తహశీల్దార్ గిరిబాబు

అర్బన్‌లో అధ్వానం

- రెండేళ్లలో 50 శాతం కూడా పూర్తి కాని ఇళ్లు
- పట్టణాలకు దూరంగా స్థలాలు
- లబ్ధిదారుల్లో అనాసక్తి కూడా కారణమే
- అధికారులకు సవాల్‌గా మారిన గృహ నిర్మాణాలు

జగనన్న కాలనీల్లోని అర్బన్ ప్రాంతాల ఇళ్ల నిర్మాణాల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి రెండేళ్లయినా శ్రీకాకుళం, ఆమదాలవలస, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో కనీసం సగం కూడా పూర్తి కాలేదు. పట్టణ ప్రాంతాలకు దూరంగా స్థలాలు ఇవ్వడం ఒక కారణంగా కనిపిస్తోంది. దీంతోపాటు అత్యధికులు తమ స్థలాలను ఆస్తిగా పరిగణిస్తున్నారు తప్ప ఇళ్లు కట్టుకునేందుకు సిద్ధపడకపోవడం మరో కారణంగా ఉంది. ప్రభుత్వం ఇస్తున్న ఆర్థికసాయం కూడా సరిపోకపోవడంతో లబ్ధిదారులు అప్పు చేసేందుకు ఇష్టపడక ముందుకు రావడం లేదు. దీంతో అర్బన్ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



ఆమదాలవలస మండలం గాజులకొల్లివలసలో అసంపూర్తిగా ఇళ్ల నిర్మాణాలు

నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు (ఎన్‌పిఐ) పథకంలో భాగంగా 74,654 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో ఇప్పటివరకు 7,625 ఇళ్లు ప్రారంభం కాలేదు. వీటిలో బిబిఎల్ (బిలో బేస్‌మెంట్ లెవల్) దశలో 24,437 ఇళ్లు, పునాది దశలో 10,294, పైకప్పు దశలో 5,256 ఇళ్లు ఉన్నాయి. శ్లాబ్ పూర్తయినవి 4,333 ఇళ్లు ఉన్నాయి. ఇప్పటివరకు 22,705 ఇళ్లు పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగాయి. మొత్తం 67,025 ఇళ్లు (89.8 శాతం) గ్రౌండింగ్ అయ్యాయి. పునాది, అంతకుమించి స్థాయి దాటినవి 42,588 ఇళ్లు (57 శాతం) ఉన్నాయి. అర్బన్ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు చాలా మందకొడిగా ఉన్నాయి. ఆమదాలవలసలో 2,742 ఇళ్లు మంజూరు చేయగా పునాది, ఆ దశ దాటినవి 860 ఇళ్లు (31.4 శాతం) ఉన్నాయి. శ్రీకాకుళం నగరం పరిధిలో ఉన్న 11,272 మంది లబ్ధిదారులకు ఇళు కేటాయించగా పునాది దాటినవి 4,191 ఇళ్లు (37.2 శాతం) మాత్రమే ఉన్నాయి. ఇచ్ఛాపురం పట్టణంలోని 2,287 మంది పేదలకు ఇళ్లు కేటాయించగా పునాది, ఆ తర్వాత స్థాయి దాటినవి 993 ఇళ్లు (43.4 శాతం) ఉన్నాయి. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 3,389 మందికి ఇళ్లు కేటాయించగా 1489 ఇళ్లు (43.9 శాతం) పునాది, ఆ తర్వాత దశ దాటి ఉన్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో కాస్త బాగు

గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాల పరిస్థితి కొంత బాగానే ఉంది. జలుమూరు మండలానికి 1708 ఇళ్లు కేటాయించగా పునాది స్థాయి దాటినవి 1421 ఇళ్లు (83.2 శాతం) ఉన్నాయి. లావేరులో 2,644 ఇళ్లకు గానూ 2094 ఇళ్లు (79.2 శాతం) పునాది స్థాయి దాటి ఉన్నాయి. ఇచ్ఛాపురం మండలానికి 1261 ఇళ్లు కేటాయించగా 997 ఇళ్లు (79.1 శాతం) పునాది స్థాయి దాటి ఉన్నాయి. జి.సిగడాం మండలంలో 1471 మందికి ఇళ్లు ఇవ్వగా 1104 మంది (75.1 శాతం) ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసే పనిలో ఉన్నారు. మందసలో 74 శాతం, కంచిలిలో 73.6 శాతం, నరసన్నపేటలో 72.8 శాతం, సరుబుజ్జిలిలో 72.5 శాతం ఇళ్లు పునాది, ఆ తర్వాత స్థాయి దాటి నిర్మాణంలో ఉన్నాయి. మొత్తం మీద జిల్లాలో 16 మండలాల్లో ఇళ్ల నిర్మాణాల పరిస్థితి కొంత మెరుగ్గానే ఉంది.

లేఅవుట్లలో నామమాత్రంగా విద్యుత్ కనెక్షన్లు

జగన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పనలోనూ వెనుకబాటు కనిపిస్తోంది. ప్రధానంగా తాగునీరు, విద్యుత్, రహదారుల పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటివరకు 22,705 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. వాటిలో సొంత స్థలాల్లో ఇళు నిర్మించుకుంటున్న 19,548 మంది, జగనన్న లేఅవుట్లలో ఇళ్లు నిర్మించుకుంటున్న వారు 3,157 మంది ఉన్నారు. వీటిలో ఇప్పటివరకు 17,657 ఇళ్లకు (77.77 శాతం) విద్యుత్ సరఫరాను అందించగలిగారు. ఇందులో సొంత స్థలాల్లో నిర్మాణం చేపడుతున 16,576 ఇళ్లకు, లేఅవుట్లలో ఉన్న 1081 ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లను ఇచ్చారు. ఆమదాలవలస అర్బన్‌లో లేవుట్లలోని మూడు ఇళ్లకు మాత్రమే విద్యుత్ సరఫరా అందించగలిగారు. మందస, కవిటి ప్రాంతాల్లో చెరో ఐదు ఇళ్లకు, శ్రీకాకుళం అర్బన్‌లో ఆరు ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. ఇచ్ఛాపురం అర్బన్, పలాస ప్రాంతాల్లో చెరో ఏడు ఇళ్లకు విద్యుత్ సరఫరా అందించగలిగారు.

తాగునీటి సౌకర్యమూ అంతంతమాత్రమే

ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు అంతంతమాత్రంగానే తాగునీటి సౌకర్యం అందించారు. జిల్లాలో 22,705 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా 17,396 ఇళ్లకు మాత్రమే తాగునీటి కనెక్షన్లు ఇచ్చారు. వీటిలో లేఅవుట్లలో కేవలం 1068 ఇళ్లకు మాత్రమే తాగునీటిని అందించగలిగారు. మిగిలిన 16,328 కనెక్షన్లు సొంతంగా ఇళ్ల నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఇచ్చారు. ఆమదాలవలస అర్బన్‌లో జగనన్న లేఅవుట్లలో నిర్మిస్తున్న ఇళ్లలో ఒక్క ఇల్లుకే తాగునీటి కనెక్షన్ ఇచ్చారు. కవిటి, మందస మండలాల్లో చెరో ఐదు ఇళ్లకు మాత్రం తాగునీటి సరఫరా ఏర్పాట్లు పూర్తయ్యాయి. శ్రీకాకుళం అర్బన్‌లో ఆరిళ్లకు, పలాసలో తొమ్మిది ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చారు.

పోర్టు రోడ్డుకు భూములు ఇవ్వలేం

- అవే మా జీవనాధారం
- తేల్చిచెప్పిన రైతులు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

తమ జీవనాధారమైన భూములను భావనపాడు పోర్టు రోడ్డు కోసం ఇవ్వలేమని టెక్కలి పంచాయతీ పితాపురం, కూర్మనాథపురం రైతులు తేల్చిచెప్పారు. టెక్కలి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ జి.సుజాత అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బెండి గిరిబాబు మాట్లాడుతూ భావనపాడు పోర్టు నిర్మాణం వల్ల ఈ ప్రాంతంలో నిరుద్యోగ సమస్య చాలావరకు తీరుతుందన్నారు. పోర్టుకు అవసరమైన రోడ్డుకు భూములు ఇచ్చిన రైతులకు మెరుగైన పరిహారం ప్రభుత్వం ఇస్తుందని, అభివృద్ధికి సహకరించాలని రైతులను కోరారు. ఆ భూములే తమ జీవనాధారమణి, వాటిని ఇచ్చే ప్రసక్తే లేదని రైతులు స్పష్టం చేశారు. పరిహారం ప్రతిపాదనలను తిరస్కరించారు. మదనగోపాల సాగరం దిగువున ఉన్న భూములు ఏడాదికి రెండు పంటలు పండుతున్నాయని, అటువంటి భూములను వదులుకుంటే బతుకుదెరువు కోల్పోతామని చెప్పారు. దీంతో విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పి రెవెన్యూ అధికారులు వెనుదిరిగారు. సమావేశంలో రైతులు బుడుమూరు చంద్రశేఖర్, పట్నాన ఢిలేశ్వరరావు, బొడ్డేపల్లి వజ్రం, పి.చంద్రశేఖరరావు, తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను అప్పగించాలి

- కార్పొరేషన్ కమిషనర్‌ను కోరిన లక్ష్మీదేవి
- ఎక్కడ ఉంటే అక్కడకు వచ్చేస్తారా అని కమిషనర్ అసహనం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

టిడ్కో ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నాయకులు గుండ లక్ష్మీదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని రైతుబజారు జంక్షన్ వద్ద మహిళా మార్టులో శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సిహెచ్.ఓబులేసును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో అర్హులైన నిరుపేదలకు 1280 ఇళ్లు నిర్మించామని, లబ్ధిదారులు డీడీలు చెల్లించినా ఇళ్లు అప్పగించలేదని గుర్తుచేశారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక లబ్ధిదారుల జాబితాలోని పేర్లను తొలగించి వైసిపి నాయకుల అనుకూలుర పేర్లను చేర్చారని విమర్శించారు.

ఎక్కడ ఉంటే అక్కడకు వచ్చేస్తారా?

కమిషనర్‌కు వినతిపత్రం అందించేందుకు లక్ష్మీదేవితో కలిసి టిడిపి నాయకులు నగరపాలక సంస్థ కార్యాలయానికి వెళ్లారు. కమిషనర్ లేకపోవడంతో ఆయన సిసికి ఫోన్ చేశారు. కార్యాలయానికి మధ్యాహ్నం రెండు గంటలకు వస్తారని చెప్పారు. దీంతో టిడిపి నాయకులు కమిషనర్ ఉన్న మహిళా మార్టు వద్దకు వెళ్లారు. తాను ఎక్కడ ఉంటే అక్కడకు వచ్చేస్తారా అని కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. కార్యాలయంలో సూపరింటెంటెంట్‌కు గానీ ఇతర అధికారులకు గానీ వినతిపత్రం ఇవ్వవచ్చు కదా అని అన్నారు. దీంతో ఆయనకు, టిడిపి నాయకులకు మధ్య స్వల్ప వాగ్వివాదం చోటుచేసుకుంది. తాము వ్యక్తిగత పనిపై రాలేదని, ప్రజా సమస్యలపై వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చామని లక్ష్మీదేవి అన్నారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, జామి భీమశంకర్, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, కొర్ను నాగార్జున ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌తో టిడిపి నాయకుల వాగ్వివాదం



కాగడా ప్రదర్శన చేపడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాటం

ఎస్‌ఎఫ్‌ఐ కాగడాల ప్రదర్శన

శ్రీకాకుళం : విప్లవ వీరుడు భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై పోరాడుతామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.రాజు, బి.హరీష్ అన్నారు. భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు వర్ధంతి సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన విద్యార్థులు స్థానిక మహిళా కళాశాల నుంచి సూర్యమహల్ కూడలి వరకు శుక్రవారం కాగడా ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరుతో బడులను మూసేస్తోందని చెప్పారు. పాఠశాలల మూతతో పేద పిల్లలు చదువుకు దూరం కానున్నారనని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే భగత్‌సింగ్ స్ఫూర్తితో పెద్దఎత్తున పోరాటం సాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ ఉపాధ్యక్షులు డి.చందు, ఎస్‌ఎఫ్‌ఐ నగర గర్ల్స్ కన్వీనర్ స్వర్ణకుమారి, కో-కన్వీనర్ మానస, స్వాతి, కమిటీ సభ్యులు వందన, పలు కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, తదితరులు

క్షయపై అప్రమత్తం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

క్షయ వ్యాధిపై అందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినంలో భాగంగా నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి శుక్రవారం ప్రారంభించారు. ఏడు రోడ్ల కూడలి వద్ద ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దగ్గు క్రమం తప్పకుండా రెండు వారాల వరకు ఉంటే దగ్గరలోని ప్రభుత్వాస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే మందుల వాడకం ప్రారంభించాలని తెలిపారు. జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్తుల కోసం సమర్థవంతమైన చికిత్స అందించేందుకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. మందులను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేస్తుందన్నారు. మందులు వాడితే ఆరు నెలల్లో తగ్గిపోతుందన్నారు.

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి మాట్లాడుతూ క్షయ అంటువ్యాధి అని, ట్యూబర్‌క్లోసిస్ అనే మైక్రో బ్యాక్టీరియా ద్వారా ఇది సంక్రమిస్తుందన్నారు. ఈ బ్యాక్టీరియాను రాబర్ట్‌కాక్ అనే శాస్త్రవేత్త కనుగొన్నారని తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు, ఆయాసం, బరువు తగ్గడం, కఫంలో రక్తం పడడం, ఛాతినొప్పి, సాయంకాలం జ్వరం, రాత్రి నిద్రలో చెమట పట్టడం క్షయ రోగి లక్షణాలని వివరించారు. జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్తులకు సమర్థవంతమైన చికిత్స అందిస్తున్నామన్నారు. జిల్లా క్షయ నివారణ అధికారి అనురాధ మాట్లాడుతూ క్షయ నివారణలో 2020 నుంచి 2022 వరకు వరుసగా మూడేళ్లు జిల్లా కాంస్య పతకాన్ని కైవసం చేసుకుందని తెలిపారు. ర్యాలీకి ముందు రాబర్ట్‌కాక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం రెడ్‌క్రాస్ ద్వారా 600 మందికి పోషకాహార కిట్లు, న్యూ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యాన ర్యంలో క్షయ వ్యాధితో చికిత్స పొందుతున్న వారికి న్యూట్రిషన్ పౌడర్ డబ్బాలు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు, అర్బన్ పిహెచ్‌సి వైద్యాధికారి జె.కృష్ణమోహన్, డిపిఆర్‌ఒ కె.బాలమాన్‌సింగ్, డెమో వెంకటరమణ, పల్మనాలజిస్టు ప్రదీపిక, తిరుపతిరావు, రెడ్డీస్ ల్యాబ్ ఫౌండేషన్ సమన్వయకర్త జి.సురేష్, అరబిందో ప్రతినిధి తదితరులకు జ్ఞాపికలు అందజేశారు. వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి పది, ఇంటర్ సార్వత్రిక పరీక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఏప్రిల్ 3 నుంచి 17వ తేదీ వరకు పదో తరగతి, ఇంటర్మీడియట్ సార్వత్రిక పరీక్షలను నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి తెలిపారు. ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమన్వయ కమిటీ సమావేశం డిఆర్‌ఒ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 1023 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారని, ఇందుకోసం ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇంటర్ పరీక్షలకు 1727 మంది విద్యార్థులు హాజరు కానుండగా ఏడు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటితో పాటు ఇంటర్ ప్రాక్టికల్స్ కోసం ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేసవి దృష్ట్యా అన్ని పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ తదితర ఏర్పాట్లతో పాటు మరుగుదొడ్లు, ఫర్నిచర్ ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు ప్రశ్నాపత్రాల పంపిణీ, అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయాలని, కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలో ఎక్కడా జిరాక్స్ కేంద్రాలు తెరవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణలో భాగంగా ఉప తహశీల్దార్ స్థాయి అధికారులతో కూడిన ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సిబ్బంది, విద్యార్థులు పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లకు అనుమతించబోమని స్పష్టం చేశారు. సమావేశంలో ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ, విద్యాశాఖ సహాయ కమిషనర్ ఆలీఖాన్, అర్బన్ పిహెచ్‌సి వైద్యాధికారి జె.కృష్ణమోహన్, పోలీస్, పోస్టల్, ఆర్‌టిసి, విద్యుత్ తదితర శాఖలకు చెందిన ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌ఒ రాజేశ్వరి

అర్జీల పెండింగ్‌పై కలెక్టర్ ఆగ్రహం

సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి - పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పురుషోత్తపురం-1 సచివాలయంలో అర్జీల పెండింగ్‌పై కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ రికార్డులకు సంబంధించిన అర్జీలో నిర్లక్ష్యంపై విఆర్‌ఒ నవుషద్ద్ అలీం, డిజిటల్ అసిస్టెంట్ స్వాతికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సచివాలయాన్ని శుక్రవారం సందర్శించిన కలెక్టర్ రికార్డులను పరిశీలించారు. సచివాలయానికి వచ్చిన అర్జీలు 37 వరకు అసంపూర్తిగా ఉన్నట్లు గుర్తించారు. భూ రికార్డులకు సంబంధించి 22-ఎలో తమ భూమి నమోదైందని, దీన్ని సరిచేయాలని సంబంధిత భూ యాజమాని అర్జీ చేసుకున్నారు. దీనిపై ఎటువంటి సమాధానం ఇవ్వకపోవడాన్ని కలెక్టర్ తప్పుపట్టారు. ఇందుకు బాధ్యులైన డిజిటల్ అసిస్టెంట్, విఆర్‌ఒకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని తహశీల్దార్ మధుసూదనరావును ఆదేశించారు. సచివాలయంలో ప్రతి అర్జీని నమోదు చేసి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల అమలు తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని అల్లుకోల సచివాలయాన్ని పరిశీలించారు.

డయాలసిస్ కేంద్రాల్లో పడకల పెంపునకు కృషి

ఉద్దాన ప్రాంతంలోని డయాలసిస్ కేంద్రాల్లో అదనంగా పడకలు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. పలాస ప్రభుత్వాస్పత్రి ఆవరణలో కోరమాండల్ గ్రోమోర్, మురుగప్ప ఎరువులు, పురుగుల మందుల కంపెనీల సౌజన్యంతో కిడ్నీ డయాలసిస్ రోగుల కోసం రూ.11 లక్షల విలువైన మందులను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులను ఆదుకోవడానికి కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడాన్ని అభినందించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ చిన్నంనాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డిసిహెచ్‌ఎస్ భాస్కరరావు, వైద్యులు మేఘన, రఘురాం, వీరస్వామి, వ్యవసాయ శాఖ జెడి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



రోగులకు మందులు అందిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

కళాశాలలకు నాక్ గుర్తింపు తప్పనిసరి

ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహనరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలకు నాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) గుర్తింపు తప్పనిసరి అని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహనరావు అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో డిగ్రీ కళాశాల కరస్పాండెంట్స్, ప్రిన్సిపాల్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలలన్నీ ఏడాదిలోగా నాక్ అక్రిడిటేషన్ పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. కళాశాల యాజమాన్యాలు, ప్రిన్సిపల్స్ నాక్ గుర్తింపు సాధించేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్య నాణ్యతా ప్రమాణాలు పెంచేందుకు చర్యలు చేపడుతోందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల సాధన కోసం మాత్రమే నాక్‌కు వెళ్లొద్దని హితవు పలికారు. విద్యార్థులకు మెరుగైన సేవలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచడం, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాల్లో ప్రమాణాలు పాటించి జాతీయస్థాయిలో అత్యుత్తమ విద్యాసంస్థగా కళాశాలను నిలబెట్టేందుకు నాక్ గుర్తింపు అవసరమన్నారు. నాక్ గుర్తింపునకు 2017 వరకు ఒక పద్ధతి ఉండేదని, ఆ తర్వాత నాక్ గుర్తింపు ప్రక్రియలో ప్రభుత్వం పలు మార్పులు చేసిందన్నారు. నాక్ గుర్తింపునకు రూ.3.5 లక్షలను ఫీజు రూపంలో చెల్లించాలన్నారు. కళశాలల సౌకర్యార్థం 45 రోజుల్లో నాక్ గుర్తింపునకు ఎలా సన్నద్ధం కావాలో ఉన్నత విద్యామండలి మార్గదర్శకాలు రూపొందించిందని తెలిపారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సిహెచ్.ఎ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించిన సమావేశంలో ఆర్ట్స్, కామర్స్, లా ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, ఐక్యుఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.స్వప్నవాహిని, పలు కళాశాలలకు చెందిన కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ ప్రొఫెసర్ రామ్మోహనరావు

రేపు పనిచేయనున్న రిజిస్ట్రార్ కార్యాలయాలు

శ్రీకాకుళం : జిల్లా కేంద్రంలోని రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఈనెల 26వ తేదీన పనిచేయనున్నట్లు రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ సర్క్యులర్ జారీ చేశారు. ఆదివారం సెలవు అయినా ప్రతిరోజూ మాదిరిగానే ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పనిచేస్తాయని తెలిపారు. వీటితోపాటు జిల్లా కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్‌తో పాటు రాజాం ఎస్‌బిఐ శాఖ కూడా డబ్బుల చెల్లింపుల కోసం తెరిచి ఉంటాయని తెలిపారు. కార్యాలయాలు తెరిచి ఉంచుతున్నట్లు కార్యాలయాల నోటీసు బోర్డుల ద్వారా ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

అంగన్వాడీ ఇంటర్వ్యూలపై స్టే

పొందూరు : జిల్లాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టులకు ఈనెల 25వ తేదీన నిర్వహించే ఇంటర్వ్యూలపై హైకోర్టు రెండు వారాల పాటు స్టే విధించింది. ఈమేరకు హైకోర్టు ఉత్తర్వులు చేరాయి. జిల్లాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టుల భర్తీకి ఐసిడిఎస్ అధికారులు గత నెల పదో తేదీన నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా నోటిఫికేషన్ జారీ చేశారని మండలంలోని పెనుబర్తి పంచాయతీ అలమాజీపేటకు చెందిన పి.కృష్ణవేణి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై పిటిషనర్ తరుపు లాయర్ వాదనలు విన్న హైకోర్టు రెండు వారాలు వాయిదా వేస్తూ తీర్పునిచ్చారు.

త్వరితగతిన వసతి భవనాల నిర్మాణం

ఎచ్చెర్ల : ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటిలో వసతి భవనాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌జియుకెటి ఛాన్సలర్ కె.సి రెడ్డి ఆదేశించారు. ట్రిపుల్ ఐటిని శుక్రవారం సందర్శించిన ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటి డైరెక్టర్ డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఒఎస్‌డి సుధాకర్‌బాబు, ఎఒ ముని రామకృష్ణ, డీన్ మోహనకృష్ణ, ఎఫ్‌ఒ అసిరినాయుడు, పిఆర్‌ఒ మామిడి షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌జియుకెటి ఛాన్సలర్ కె.సి రెడ్డి

డిఫెన్స్‌లో చేరేందుకు యువతకు అవకాశాలు

ఇండియన్ ఆర్మీ కాలింగ్ డైరెక్టర్ బి.వి రమణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

భారత్ రక్షణ రంగంలో ఆఫీసర్ క్యాడర్‌లో తెలుగు వారి శాతం తక్కువగా ఉందని, అధికార హోదాపై సరైన అవగాహన లేకపోవడం వల్ల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నట్లు ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థ డైరెక్టర్ బి.వి రమణ అన్నారు. నగరంలోని బ్యాంకర్స్ కాలనీలోని ఆ సంస్థ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యుపిఎస్‌సిఎస్, ఎన్‌డిఎ ఆఫీసర్స్, టిఇఎస్, సిడిఎస్ అధికారుల కేడర్‌లో ఉద్యోగాల్లో చేరేందుకు తెలుగు రాష్ట్రాల్లోని యువతను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది నుంచి పదో తరగతి విద్యార్హతతో ప్లస్ 2తో డిఫెన్స్ కోర్సును ప్రారంభించామన్నారు. ఈ కోర్సును పూర్తిస్థాయి సైనిక శిక్షణతో జిల్లాలో ప్రారంభించినట్లు తెలిపారు. ఇంటర్ విద్య పూర్తి చేసుకున్న యువత ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, పారామిలటరీ వంటి రంగాల్లో ఆఫీసర్ స్థాయి ఉద్యోగాల్లో చేరేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు.

25 నుంచి రిజిస్ట్రేషన్‌కు అవకాశం

టెన్త్ ప్లస్ 2తో డిఫెన్స్‌లో ఆఫీసర్ ఉద్యోగాలు సాధించే దిశగా పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఈనెల 25 నుంచి ఏప్రిల్ 25వ తేదీ వరకు www.indianarmycalling.com వెబ్‌సైట్‌లో రూ.100 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మేలో అకాడమీ ఆధ్వర్యాన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఈ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన వారికి రెండేళ్ల పాటు ఇండియన్ ఆర్మీ కాలింగ్ సెంటర్ ద్వారా ఉచితంగా ఇంటర్ విద్యతో పాటు డిఫెన్స్ శిక్షణ అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 6281284246, 8712704951 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు. సమావేశంలో చైర్మన్ గోవిందరావు, ఇన్‌ఛార్జి సురేంద్ర, ఎఒ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇండియన్ ఆర్మీ కాలింగ్ డైరెక్టర్ రమణ

ఉపాధి కూలీలకు గరిష్ట కూలి

డ్వామా పీడీ చిట్టిరాజు



మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

ఉపాధి హామీ కూలీలకు పూర్తిస్థాయిలో కూలి అందజేయాలని డ్వామా పీడీ జివి.చిట్టిరాజు అన్నారు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 15వ రౌండ్ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఏప్రిల్ 2021-2022 మార్చి 31 వరకు రూ.11.96 కోట్లతో పనులు జరిగాయని అన్నారు. అందులో ఉపాధి కూలీలకు రూ.8 కోట్లు, పంచాయతీరాజ్ పనులకు రూ.2.43 కోట్లు, కాలువ నిర్మాణాలకు రూ.19 లక్షలు, ఐటిడిఎ పరిధిలో 96కాంపౌండ్ వాల్స్‌కు రూ.19 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. ప్రధానంగా ప్రతి గ్రామంలో మొక్కలు నాటినట్లు చెప్పారు. కానీ రోడ్లు, పైపులైన్లు వేసేటప్పుడు మొక్కలు చనిపోతున్నాయని అన్నారు. లింగాలవలస పంచాయతీలో వర్క్ కోసం 400 బస్తాలు సిమెంటు అడ్వాన్స్‌గా ఇచ్చినా పనులు చేపట్టలేదని సోషల్ ఆడిట్ సిబ్బంది గుర్తించారు. ప్రతి పంచాయతీలోనూ మొక్కలు పోవడం గుర్తించారు. ప్రతి పంచాయతీలోనూ హాజరుపట్టికలో దిద్దుబాట్లు ఉండడంతో ఫీల్డ్ అసిస్టెంట్‌లపై పిడి మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపిపి అట్లా సరోజనమ్మ, ఎపిడి బి.మురళీకృష్ణ, ఎంపిడిఒ జి.ఉమాసుందరి, ఎపిఒ బి.ప్రసాదరావు, ఎస్ఆర్‌పి సింహాద్రి, ఫీల్డ్ అసిస్టెంట్లు, సోషల్ ఆడిట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

16వ రోజుకు రెవెన్యూ ఉద్యోగుల నిరసన


నిరసన తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా అమరావతి జెఎసి పిలుపు నందుకుని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంత, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు గడచిన 16 రోజులు చేపడుతున్న నిరసన కార్యక్రమాలు శుక్రవారం కొనసాగించారు. తహశీల్దారు కార్యాలయాల ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయాన నిరసన చేపట్టారు. శ్రీకాకుళం తహశీల్దారు కార్యాలయం ఎదుట చేప్టిన నిరసన కార్యక్రమంలో రెవిన్యూ సర్వీసుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బివివిఎన్ రాజు హాజరై మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధనకై ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. అందులో బాగంగా గడచిన నాలుగు రోజులుగా వర్కు టు రూల్ పాటిస్తూ తమ నిరసన తెలుపు తున్నా మన్నారు. ఈకార్యక్రమం లో రెవిన్యూ ఉద్యోగులు హాజరయ్యారు.

విద్యతోనే పేదరికం దూరం


పరీక్షా సామగ్రిని అందజేస్తున్న సూర శ్రీనివాసరావు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

విద్యతోనే పేదరికాన్ని జయించవచ్చని, విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని ఎస్ ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత సూర శ్రీనివాసరావు అన్నారు. లావేరు, రణస్థలం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న 500 మంది విద్యార్థులకు అట్ట, పెన్ను, పరీక్ష సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదరికంలోనుంచి బయటపడాలంటే విద్యకు మించిన సాధనం లేదని, మంచి ప్రణాళికతో విద్యనభ్యసించడం ద్వారా భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించేలా కష్టపడి చదవాలని పదోతరగతి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. 100కు 100 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి మీ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

35 మందికి పరీక్షా సామగ్రి అందజేత

టెక్కలి: మండలంలోని నర్సింగపల్లి గ్రామానికి చెందిన రాంబాబు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జెడ్‌పి ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 35 మంది విద్యార్థులకు శుక్రవారం పరీక్షా సామగ్రిని ట్రస్టు నిర్వాహకులు ఎన్ని షణ్ముఖరావు అందజేశారు. హెచ్‌ఎం సోమేశ్వరరావు మాట్లాడుతు పాఠశాల అభివృద్ధిలో గ్రామస్తుల భాగస్వామ్యం అవసరమన్నారు. కార్యక్రమంలో సభ్యులు పెదరట్టి మణి, ఉపాధ్యాయులు ఇసపల్లి చిన్నవాడు, పాలవలస ధర్మారావు, రోణంకి విజయ్‌కుమార్, యరపత్ని వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

బోయ వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చొద్దు

ప్రజాశక్తి - సారవకోట

శాసనసభలో ముఖ్యమంత్రి జగన్ బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ కేంద్రానికి పంపిన తీర్మానం వెంటనే ఉపసంహరించుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి అన్నారు. సారవకోటలో ఆదివాసీలతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆదివాసీల రిజర్వేషన్లు దోచుకోవడానికి రాజకీయ పార్టీలు ఓట్ల కోసం అగ్రకులాలను తీసుకొచ్చి ఎస్‌టిల్లో చేర్చాలని ప్రయత్నించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆదివాసీ చట్టాలను నిర్వీర్యం చేసేందుకు రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ఆదివాసీ రిజర్వేషన్ల మీద గెలుపొందిన ఏడుగురు ఎమ్మెల్యేలు నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలంతా ఏకమై చలో ఢిల్లీ కార్యక్రమం చేపడతామని త్వరలో తేదీని ప్రకటిస్తామన్నారు.


అఖిల్ సాయి, ధనలక్ష్మి, మౌనిక, పూజిత, యమున, చింత పవన్, లహరి, కృష్ణసాయి

ఎన్ఎంఎంఎస్‌లో సత్తాచాటిన విద్యార్థులు

వజ్రపుకొత్తూరు: ప్రభుత్వ నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్)లో పాత టెక్కలి విద్యార్థులు తమ సత్తా చాటారు. శుక్రవారం విడుదలైన ఫలితాలలో లమ్మత అఖిల్ సాయి 151 మార్కులు సాధించాడు. అదే పాఠశాలకు చెందిన వంక మౌనిక, కొడ ధనలక్ష్మి కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనానికి ఎంపికయ్యారు. గోవిందపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన చింత పవన్, జినగ యమున, పొల్లాడ యుపి పాఠశాలకు చెందిన జోగ పూజిత ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు. ఈ పరీక్షలో సత్తాచాటిన విద్యార్థులు 9వ తరగతి నుంచి డిగ్రీ వరకు సంవత్సరానికి రూ.12వేలు చొప్పున ఉపకార వేతనాలు అందుతాయని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాత టెక్కలి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మల్లారెడ్డి పద్మనాభరావు, పాత టెక్కలి సర్పంచ్ సుశీల, ఎంపిటిసి బాలక శ్రీను విద్యార్థులతో పాటు గైడ్ టీచర్ డి.సంతోషి కుమార్‌ను అభినందించారు. గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం టి.లింగరాజు పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు పాపారావు, పాలిన శోభన్ తదితరులు విద్యార్థులతో పాటు గైడ్ టీచర్ చింత ఉమారావు, కెంగివ రాంబాబును అభినందించారు. యుపి పాఠశాల హెచ్‌ఎం హరికృష్ణ, సర్పంచ్ అట్టాడ గోవిందరావు విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.

సత్తాచాటిన తాడివలస విద్యార్థులు

పొందూరు: ఈ ఏడాది జాతీయ స్థాయిలో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ ప్రతిభా పరీక్షలో తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వండాన కృష్ణసాయి, కూన లహరి సత్తా చాటారు. కృష్ణ సాయి 134 మార్కులు, లహరి 114 మార్కులు సాధించి ప్రతి ఏటా అందించే రూ.12000 స్కాలర్ షిప్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం లఖినాన హేమనాచార్యులు తెలిపారు. విద్యార్థులు ఎంపిక కావడంపై సర్పంచ్ తమ్మినైన మణెమ్మ, ప్రసాదరావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

రెండో విడత సర్వే ప్రారంభం

ఇచ్ఛాపురం: ప్రైవేటు ఎలక్ట్రీషియన్ల స్థితిగతులపై ఎపి ప్రైవేటు ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యాన రెండో విడత సర్వే ఇచ్ఛాపురం నుంచి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు డివి.సత్యనారాయణ, ఉపాధ్యక్షులు పాల్ రాజ్, కె.శ్రీహరిరావు, తదితరులు స్థానిక ప్రైవేటు ఎలక్ట్రీషియన్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి హరిరావు మాట్లాడుతూ 2018లో జరిగిన సర్వే రాష్ట్రంలో 5లక్షల మంది ఎలక్ట్రీషియన్లు ఉన్నారని తేలిందన్నారు. వీరి సమస్యలు సేకరించి, వాటి పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ సంక్షేమానికి ప్రభుత్వం నిధులు వెచ్చించాలని, వృత్తిపరమైన సామగ్రి కొనుగోలుకు రుణాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాదన్న, శ్రీధర్, రవిబాబు, ఇచ్ఛాపురం అసోసియేషన్ సభ్యులు రంగాల శ్రీనివాస్, కృష్ణ, శ్రీనివాస్, యోగి, ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.


రోగులకు పళ్లు పంచుతున్న రామ్‌చరణ్ అభిమానులు

రోగులకు పళ్లు పంపిణీ

శ్రీకాకుళం అర్బన్: సినీనటుడు రామ్‌చరణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులు శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో రోగులకు రొట్టెలు, పళ్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో రామ్ చరణ్ యువత జిల్లా అధ్యక్షుడు లింగాల హరిష్ ,గోవింద్ ,హిమశేఖర్ ,ప్రభు,నవీన్ , జిల్లా పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అధ్యక్షులు కిరణ్ కిర్రు, కిరణ్, సంతోష్, అల్లు అర్జున్ ఫ్యాన్స్ అధ్యక్షులు పి.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

'పోర్టు' నిర్వాసితులకు పరిహారం పెంచాలి

ముఖ్యమంత్రికి మూలపేట సర్పంచ్ వినతి


ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న మూలపేట సర్పంచ్ బాబురావు

ప్రజాశక్తి - నౌపడ

సంతబొమ్మాళి మండలం మూలపేటలో నిర్మించనున్న భావనపాడు గ్రీన్ ఫీల్డ్ పోర్టు నిర్వాసితులకు అదనపు పరిహారం అందించాలని నిర్వాసితులు శుక్రవారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కోరారు. అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆధ్వర్యాన మూలపేట సర్పంచ్ జీరు బాబురావు ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. నిర్వాసిత గ్రామాలైన మూలపేట, విష్ణుచక్రంలోని నిర్వాసితులకు పిడిఎఫ్ ప్యాకేజీ కింద ఇంటి నిర్మాణ నగదుతో కలిపి అందజేస్తున్న రూ.9,91,000 నష్ట పరిహారం సరిపోదని తెలియజేశారు. దీనికి అదనంగా మరో రూ.2,50,000 ఇవ్వాలని కోరారు. అదేవిధంగా గృహ నిర్మాణం కోసం ప్యాకేజీలో రూ3.50లక్షలతో ఇల్లు నిర్మించలేమని, ప్రతి నిర్వాసిత కుటుంబానికీ ప్రభుత్వమే ఇల్లు కట్టించి ఇవ్వాలని కోరారు. తగిన విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేసి భూములు, ఇళ్ల త్యాగం చేస్తున్న నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ బాబురావు తెలిపారు.

26న తూర్పుకాపు సంక్షేమ సంఘం ఆత్మీయ సదస్సు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

తూర్పుకాపు సంక్షేమ సంఘం ఐక్యతకు, సంఘ బలోపేతానికి సంబంధించి ఈ నెల 26న తూర్పుకాపు సంక్షేమ సంఘం ప్రతినిధుల ఆధ్వర్యాన ఆత్మీయ సదస్సు నిర్వహిస్తున్నామని సంఘ జిల్లా అధ్యక్షులు సురంగి మోహనరావు, ప్రతినిధులు ఎస్.కె నాయుడు, రాడ కైలాసరావు తెలిపారు. సంఘ జిల్లా కార్యాలయంలో సంఘ నిర్వాహక కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహించే సదస్సుకు పెద్దసంఖ్యలో తూర్పు కాపులు హాజరు కావాలన్నారు. సమావేశంలో తూర్పుకాపు ఉద్యోగ సంఘ ప్రతినిధులు ఎల్.వి రాజశేఖర్, డాక్టర్ రామజోగినాయుడు, కిలారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం లభిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ స్వర్ణమణి అన్నారు. శుక్రవారం పౌష్టికాహార పక్షోత్సవంలో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, బాలింతల ఆరోగ్యం విషయంలో అనేక కార్యక్రమాలు ఐసిడిఎస్ ద్వారా ప్రజలకు అర్థమయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. కారక్రమంలో సిడిపిఒ నాగరాణి, ఎసిడిపిఒ లావణ్య, మెప్మా అధికారి జానకిరావు, అంగన్వాడీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

సంక్షిప్త వార్తలు

సుందర గ్రామాలుగా తీర్చిదిద్దాలి : తిలక్


వర్మీ కంపోస్టును పరిశీలిస్తున్న పేరాడ తిలక్

ప్రజాశక్తి - నందిగాం

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చి, సుందర గ్రామాలుగా తీర్చిదిద్దాలని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రంలో నిర్వహించిన స్వచ్ఛ సంకల్పం శిక్షణా శిబిరంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఈ కేంద్రాల నిర్వహణ, వర్మీ కంపోస్ట్ తయారీ, తదితర కార్యక్రమాలపై ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. పారిశుధ్య కార్మికులకు నెలవారి జీతాలు అందేలా చూడాలని కోరారు. అనంతరం చెత్త నుంచి సంపద కేంద్రంలో తయారవుతున్న వర్మీ కంపోస్ట్ తయారీ విధానం, మార్కెటింగ్ సదుపాయం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి, జడ్యాడ జయరాం, ఎంపిడిఒ హెచ్‌వి.రమణమూర్తి, వైస్ ఎంపిపిలు ఆర్.కూర్మారావు, సువ్వారి వసంత్‌కుమార్, చిన్ని జోగారావు, సర్పంచ్‌లు గున్నయ్య, ఎ.శ్రీనివాస్, ఎర్రయ్య, సోమేశ్వరరావు, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి


నివాళులర్పిస్తున్న షణ్ముఖరావు, తదితరులు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల ఆశయ సాధనకు కృషి చేద్దామని సిఐటియు జిల్లా నాయకులు ఎన్.షణ్ముఖరావు అన్నారు. టెక్కలి సిఐటియు కార్యాలయంలో యు.లక్ష్మణరావు అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రాణాలు వదిలిన విప్లవీరులు వీరని అన్నారు. బ్రిటీష్‌వారిని క్షమాభిక్ష కోరకుండా దేశం కోసం ప్రాణాలు అర్పించిన త్యాగులని చెప్పారు. నేడు దేశ సంపదను కేంద్రంలోని బిజెపి పెట్టుబడిదారులకు అప్పనంగా అప్పజెబుతోందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఎటువంటి త్యాగాలు చేయని వారే నేడు కేంద్రంలో అధికారంలో ఉన్నారని అన్నారు. వారి త్యాగాల చరిత్రకు వారసులుగా మనమే ఈ దేశ సంపదను, సమైక్యత, సమగ్రతను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలోయు. లక్ష్మణరావు, బగాది వాసు, సుబ్రహ్మణ్యం, అనపాన జనార్ధన, విజయ మూర్తి ,నారాయణ, సచిన్ మన్మథరావు ,సురేష్, డివైఎఫ్ఐ నాయకులు ఉదయ్, ఎస్ఎఫ్ఐ నాయకులు దుర్గాప్రసాద్, సిహెచ్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

నేలవాలిన మొక్కజొన్న పరిశీలన


సోంపేట : టమోటా పంటను పరిశీలిస్తున్న సర్పంచ్

పొందూరు: మండలంలోని తండ్యాంలో అల్పపీడనం కారణంగా కురిసిన వర్షాలకు నేలవాలిన మొక్కజొన్న పంటను వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో సుమారు 200 ఎకరాల వరకూ మొక్కజొన్న పంటను సాగు చేయగా ఈ వర్షం కారణంగా చాలా వరకూ నష్టం జరిగిందంటూ రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. వారితో పాటు సర్పంచ్ ప్రతినిధి భాస్కరరావు, విఆర్‌ఒ శంకరరావు, విఎఎ, రైతులు ఉన్నారు.

సోంపేట: పలాసపురం పంచాయతీలో వర్షాలకు దెబ్బతిన్న టమోటా పంటను సర్పంచ్ తడక జోగారావు శుక్రవారం పరిశీలించారు. నష్టపోయిన రైతులతో మాట్లాడారు. వర్షాల వల్ల పంటకు తెగుళ్ల సోకే అవకాశం ఉందని, నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి జీవిత, స్థానిక రైతులు పాల్గొన్నారు.

గిరిబాబుకు సన్మానం


చైర్మన్ గిరిబాబును సన్మానిస్తున్న సిబ్బంది

పలాస: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం చైర్మన్‌గా బల్ల గిరిబాబు పదవి చేపట్టి శుక్రవారం రెండేళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా మున్సిపల్ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వై.అప్పలస్వామి, పండా, సిబ్బంది పాల్గొన్నారు.

5జిపై ఐతమ్‌లో సదస్సు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఈసిఈ, విద్యాంజలి విభాగాలు సంయుక్తంగా 'రీసెంట్ అండ్ ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ వైర్‌లెస్ కమ్యూనికేషన్, 5జి, 6జి' అనే అంశంపై శుక్రవారం ఆన్‌లైన్‌లో సదస్సు నిర్వహించినట్లు డైరెక్టర్ వివి.నాగేశ్వరరావు తెలిపారు. చెన్నై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ ఆర్.కృష్ణమూర్తి మాట్లాడుతూ 4జి సాంకేతికత వల్ల డేటా పంపిణీ, సేకరణలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. 5జి, 6జి టెక్నాలజీ ఇంకా ప్రాథమిక స్థాయిలో ఉన్నప్పటికీ యూరప్ దేశాల్లో గణనీయమైన వృద్ధి సాధిస్తోందని పేర్కొన్నారు. ఓపెన్ సిగ్నల్ సంస్థ నివేదిక ప్రకారం 5జి స్వీకరణ వేగంగా 250 ఎంబిపిఎస్‌గా ఉందన్నారు. ఎల్వివాన్, వైఫై, విజెడెక్స్ వంటి సాంకేతిక గురించి వివరించారు. ఐతమ్ డైరెక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ వైర్‌లెస్ టెక్నాలజీ వల్ల విద్యార్థులు పుస్తకాలను, కావాల్సిన సమాచారాన్ని బదిలీ చేసుకోవచ్చన్నారు. 5జి, 6జి వల్ల అధిక ఫోన్ మెమరీ, ఫీచర్స్ అరచేతుల్లో అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాస్ ఆరె యాంటిన్నాపై పరిశోధన జరుగుతుందని, ఏడు బిలియన్ల మందికి పైగా వైర్‌లెస్ పరికరాలు వాడుతున్నారని వివరించారు. ఈసిఈ హెచ్ఒడి డాక్టర్ బి.రామారావు, విద్యాంజలి నోడల్ ఆఫీసర్ ఎస్.భాస్కరబాబుతో పాటు 34 మంది అధ్యాపకులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధ పంటల సాగుతో మేలు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

ఖరీఫ్‌లో అధిక దిగుబడులు సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా సాగు చేయాలని వ్యవసాయ విస్తరణ విభాగం ఉన్నతాధికారి డాక్టర్ డి.చిన్నంనాయుడు అన్నారు. అలికాంలో నైర వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యాన ఎన్ఎస్ఎస్ రెండో రోజు శుక్రవారం సాగుపై రైతుల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల ప్రణాళిక, వాటి యజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కలిగి ఉండాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి పోషకాహార ఆవశ్యకతపై వివరించారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు నీలవేణి, సునీత, వ్యవసాయ కళాశాల ఆచార్యులు జి.ఎస్ రాయ్, సర్పంచ్ రంధి అప్పలస్వామి, విఎఎ లావణ్య, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిన్నంనాయుడు

పట్టపగలు చోరీ

- బంగారం, వెండి ఆభరణాలు అపహరణ
- రంగంలోకి దిగిన క్లూస్ టీం



ప్రజాశక్తి - రణస్థలం

మండలంలోని బావరాజుపాలెంలో పట్టపగలే చోరీ జరిగింది. బంగారం, వెండి ఆభరణాలతో పాటు, నగదు అపహరణకు గురైంది. పోలీసుల కథనం ప్రకారం... మండల కేంద్రంలో గాజుల వ్యాపారం చేసుకుంటున్న సుగ్గ శ్యామల, ఆమె భర్త గోవిందరావు శుక్రవారం ఉదయం ఇంటి పనులన్నీ ముగించుకున్నారు. రోజూ మాదిరిగనే ఉదయం 10గంటలకు షాపుకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగులు డ్డారు. ఇంటి గ్రిల్స్, తలుపులు కట్ చేసి ఇంటిలోకి చొరబడ్డారు. బీరువాను బద్దలుకొట్టి అందులోని ఆరు తులాల బంగారం, 11 తులాల వెండి, ఇంటి ఖర్చులకు ఉంచిన నగదు దొంగలించుకుపోయారు. స్థానికులు గుర్తించి ఇంటి యజమానులకు చెప్పడంతో వారు ఇంటికొచ్చి చూసేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. విషయాన్ని జెఆర్.పురం పోలీసులకు తెలియజేశారు. వారు వచ్చి ఇంటిని పరిశీలించారు. చుట్టుపక్కల ఉన్న సిసి ఫుటేజ్ పరిశీలించగా గుర్తుతెలియని ముగ్గురు యువకులు ఒక ద్విచక్ర వాహనంపై వచ్చి దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లేగ దూడలను సంరక్షించాలి

పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ మన్మథరావు


ఉత్తమ రైతులకు బహుమతులు ప్రదానం చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ఆమదాలవలస

లేగ దూడలను సంరక్షించి కాపాడాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివ్వాల మన్మథరావు అన్నారు. శుక్రవారం సరుబుజ్జిలి మండలం కొండవలసలో పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను ఎంపిటిసి లావేటి అనిల్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మన్మథరావు మాట్లాడుతూ లేగ దూడల పెంపకం ఆవశ్యకతను వివరించారు. లింగ నిర్ధారణ వీర్యంను ఉపయోగించి ఆడ దూడలు పుట్టే పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్. సుబ్రహ్మణ్యం దూడ యాజమాన్యం, పోషణ గురించి వివరించారు. ఈ ప్రదర్శనలో హెచ్‌ఎఫ్, జెర్సీ, గిర్ జాతులకు చెందిన ఆడ దూడలను తీసుకొచ్చి రైతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డిఎల్‌డిఎ పశు వైద్యులు రాధాకుమార్ ఆధ్వర్యంలో దూడలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ ప్రదర్శనలో దూడలకు బాగా పోషణ చేసిన రైతులు బొత్స వెంకటరమణ, చీపురు సూర్యనారాయణలకు ప్రథమ, ద్వితీయ బహుమతులను, మిగిలిన రైతులకు కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు లావేటి విశ్వేశ్వరరావు, సద్గురు గురువులునాయుడు, పశు వైద్యులు డాక్టర్ సతీష్‌కుమార్, ఎస్.కరుణ, పశువైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడు మృతి

పలాస: పలాస రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం-2పై సోంపేట మండలం పొత్రకొండ గ్రామానికి చెందిన గోకర్ల వెంకటస్వామి(70) మృతి చెందాడు. రైలు కిందపడి మృతి చెందాడా, లేదా ఇతర కారణాల వల్ల అనే వివరాలు తెలియాల్సి ఉందని రైల్వే ఎస్ఐ షరీఫ్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు.

పాఠశాల సందర్శన

సోంపేట: స్థానిక జెడ్‌పి బాలిక ఉన్నత పాఠశాలను ఎంఇఒ జోరాడు, ఎంపిడిఒ వెంకటరమణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో మాట్లాడి పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

40 మందికి కిడ్నీ వైద్య పరీక్షలు

మెళియాపుట్టి: స్థానిక పిహెచ్‌సిలో వైద్యాధికారి గ్రీష్మ, రాగోలు జెమ్స్ నెఫ్రాలజిస్టు డాక్టర్ రాకేష్ 40 మందికి కిడ్నీవైద్యపరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. ఇంకా ఎవరైనా ఉంటే ఈ నెల 31న రాగోలు జెమ్స్‌లో ఉచితంగా డయాలసిస్, రక్త పరీక్షలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి పి.జైమునిరావు, చాపర మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ అలేఖ్య, ఎఎన్ఎం, ఆశ, తదితరులు పాల్గొన్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు


మోహన్‌కు నగదు, వీల్‌చైర్‌ను అందిస్తున్న సర్పంచ్ ప్రకాష్

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు భేష్

ప్రజాశక్తి - కవిటి

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అమోఘమని బిజి పుట్టుగ సర్పంచ్ బద్రి ప్రకాష్ కొనియాడారు. మండలంలోని బి.గొనపపుట్టుగ గ్రామానికి చెందిన క్షతగాత్రుడు మోహన్‌కు రూ.5వేలు నగదు, వీల్ చైర్‌ను సర్పంచ్ బి.ప్రకాష్ శుక్రవారం అందించారు. ఇటీవల జరిగిన రైలు ప్రమాదంలో మోహన్ తన రెండు కాళ్లను పోగొట్టుకుని ప్రస్తుతం దయనీయ పరిస్థితిలో ఉన్నాడు. విషయం తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు రూ.5వేలు నగదుతో పాటు, రెండు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులు అందజేశారు. కొర్రాయిపుట్టుగ యూత్ రూ.5వేలు, జెడి ఫౌండేషన్, సీతయ్య ఫౌండేషన్, నేషనల్ రోటరీ క్లబ్ సంస్థ తరపున వీల్ చైర్‌ను అందజేసింది. కార్యక్రమంలో సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రమేష్ సాహు, కాళీ సాహు, సిసింద్రి, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, జెడి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాలకు అమృత్ జలధార

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

షెడ్యూల్డ్ కులాలకు చెందిన లబ్ధిదారులకు సాగు అవసరాల కోసం కేంద్ర ప్రభుత్వం అమృత్ జలధార పథకాన్ని మంజూరు చేసిందని ఎస్‌సి కార్పొరేషన్ ఇడి కె.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా నీటి వసతులు లేని షెడ్యూల్డ్ కులాల వారి భూములకు నీటి వసతిని కల్పించేందుకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. షెడ్యూల్డ్ కులాల రైతులు కనీసం 2.50 ఎకరాల భూమి కలిగి, వార్షికాదాయం రూ.మూడు లక్షల లోపు ఉంటే ఈ పథకం క్రింద బోరు బావులు, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింకర్లు కొనుక్కునేందుకు ఆర్థికసాయం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు ఖరీదులో 50 శాతం సబ్సిడీ లేదా రూ.50 వేలకు మించకుండా ఆర్థిక సాయాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. ఈ భూములపై 2022-23 ఆర్థిక సంవత్సరంలో రుణం పొంది ఉన్న వారే అర్హులని తెలిపారు. నిరుద్యోగ షెడ్యూల్డ్ కులాల యువతకు యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్ పథకం ద్వారా స్వయం ఉపాధి కోసం ట్రాక్టర్, ట్రాలీ, కమర్షియల్ వాహనాలు, వేర్ హౌసెస్, గోదాముల ఏర్పాటుకు ఆర్థిక సాయం అందజేయనున్నట్లు తెలిపారు. 50 శాతం సబ్సిడీ లేదా రూ.60 వేలకు మించకుండా ఆర్థిక సాయాన్ని అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకం కోసం బ్యాంకు ద్వారా 2022-23 సంవత్సరంలో రుణం తప్పనిసరిగా పొందిన వారే అర్హులన్నారు. అర్హులైన వారు రేషన్, ఆధార్ కార్డు, కుల, విద్యార్హత ధ్రువపత్రం, పాస్ ఫొటో, బ్యాంకు అకౌంటు పాస్‌బుక్ నకలు కాపీ, మొబైల్ నంబరు, బోరు బావులకి సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకం నకలు, ట్రాన్స్‌పోర్ట్ సెక్టార్ అయితే డ్రైవింగ్ లైసెన్సు కాపీలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వేలంపాటకు గట్టి పోటీ



ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పురపాలక సంఘంలో వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆశీల వసూలుకు శనివారం నిర్వహించే బహిరంగ వేలం పాటకు గట్టి పోటీ ఏర్పడనుంది. మున్సిపల్ వేలం పాటలో డైలీ మార్కెట్, వీధి గుత్తకు వేర్వేరుగా వేలం పా నిర్వహించే అధికారులు ఈ సారి రెండూ కలిపి ఒకే పాట వేసేందుకు అధికారులు ఖరారు చేశారు. ప్రతి ఏటా జరిగే వేలం పాటకు ఈ సారి 2023-24కు సంబంధించి జరిగే వేలం పాటకు వ్యత్యాసం ఉంది. ఈ సారీ పట్టణంలో నెల రోజుల పాటు జరిగే గ్రామ దేవత స్వేచ్ఛవతి అమ్మవారు సంబరాలు ఉండటం వల్ల ఆరు నెలల ఆదాయం ఒక్క నెల రోజుల్లోనే వసూలు అయ్యే అవకాశం ఉండడం వల్ల పాటదారులు ఎక్కువ మంది వేలం పాట కైవసం చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. పాట దారులతో అధికారులు కుమ్మకు అయితే మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయానికి గండి పడే అవకాశముంది. అలా కాకుండా పాటదారులు సిండికేట్ అయితే గత ఏడాది కంటే కొద్దిగా పెంచి ఖారారు చేసుకునే అవకాశం ఉంది. అందరి దృష్టి సంబరాలపై ఉండటం వల్ల ఈ సారి వేలం పాటపై గట్టి పోటీ తప్పదని తెలుస్తోంది. మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడకుండా పాలకవర్గం, అధికార యంత్రాంగం తీసుకునే చర్యలపై అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

నేడు జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

వజ్రపుకొత్తూరు: యువతరం సేవా సమితి తృతీయ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక సాయి వినీత్ విద్యా సంస్థ ఆవరణలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలలు శనివారం నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షులు చింత మురళి తెలిపారు. శుక్రవారం పూండిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పోటీలో 6వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చని చెప్పారు. పాఠశాల నుంచి రెండు బృందాలు పాల్గొనవచ్చని అన్నారు. చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టెక్కలి రూరల్: రావివలస 33/11 కెవి సబ్ స్టేషన్‌లో మరమతులు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరా ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిలుపుదల చేస్తున్నట్లు ఎఇ వి.ఎ.రాజశేఖర్ తెలిపారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

ప్రశాంత వాతావరణం అవసరం



సరస్వతిదేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఇఒ తులసీరావు

వజ్రపుకొత్తూరు: పాఠశాల పరిసరాల వాతావరణం ప్రశాంతంగా ఉంటే విద్యా బోధనకు అనువుగా ఉంటాయని ఎంఇఒ దల్లి తులసీరావు అన్నారు. నువ్వలరేవు పాఠశాల ఆవరణలో సరస్వతి, వివేకానంద విగ్రహాలను శుక్రవారం ఆవిష్కరించారు. హెచ్ఎం కింతలి సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఆయన మాట్లాడారు. నాడు-నేడు ద్వారా పాఠశాలలకు నూతన హంగులు వచ్చాయన్నారు. దాతల సహకారంతో నువ్వలరేవు పాఠశాల అభివద్ధి పథంలో పయనిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసిలు బైనపల్లి ఆనంద్, వెంకటేష్, గ్రామ పెద్దలు మువ్వల ఎర్రా, బైనపల్లి త్రినాథ, బి.నీలంబర్, ఎం.దేవా, నవీన్, నీలాకర్, కృష్ణ, పూర్వ హెచ్ఎం బమ్మిడి చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా చెక్కు అందజేత



నమూనా చెక్కు అందిస్తున్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి - నౌపడ

సంతబొమ్మాళి మండలం నౌపడ-1 సచివాలయం పరిధిలోని కనిరెడ్డి భార్గవ్‌రెడ్డి కుటుంబానికి రూ.4,90,000 వైఎస్ఆర్ బీమా నమూనా చెక్కును అందించారు. సర్పంచ్ ప్రతినిధి పిలక రవికుమార్‌రెడ్డి మృతుని భార్య గౌరీదేవికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు లోపింటి రాములు, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, ఉమాపతి, సచివాలయ సిబ్బంది గవరయ్య, వెంకటనారాయణ పాల్గొన్నారు.

పరస్పర సహకారం అవసరం

ప్రజాశక్తి - టెక్కలి

పరస్పర సహకారంతో మండల మహిళా సమాఖ్య సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఏరియా కో-ఆర్డినేటర్ శిష్ట శ్రీరాములు అన్నారు. వైఎస్ఆర్ ఆసరా మూడో విడత నిధులు మంజూరు గురించి వివరించారు. వైఎస్ఆర్ ఆసరా ద్వారా లబ్ధిపొందిన సంఘ సభ్యులు జీవనోపాధిని మెరుగుపర్చుకోవడం, కొత్త జీవనోపాధిని ఏర్పరచుట ద్వారా వారి ఆదాయాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. గొర్రెలు, పెరటి కోళ్ల పెంపకం, కిరాణా, కూరగాయలు, పండ్ల వ్యాపారం చేపట్టాలని ఎపిఎం జి.నారాయణరావు అన్నారు. సమావేశంలో నాగమణి, సిసి పద్మ, విఒఎ ప్రమీల పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం: లొద్దపుట్టిలో శుక్రవారం మహిళా స్వయంశక్తి సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. చిరుధాన్యాల ప్రాధాన్యతపై వెలుగు ఎపిఎం ప్రసాదరావు అవగాహన కల్పించారు. పెరటి తోటల పెంపకం, చిరుధాన్యాల సాగు, ప్లాసిక్ నిషేధ, గ్రామాల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సంఘ సభ్యులకు ఆర్థిక లావాదేవీలు, పుస్తక నిర్వహణ, గ్రేడింగ్ విషయాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిసి రామకృష్ణ, సుధాలత, లక్ష్మి, నీలవేణి, దేవకి, తదితరులు పాల్గొన్నారు.

దళితులకు తీరని అన్యాయం

ప్రజాశక్తి - ఆమదాలవలస

దళితుల ఓటు బ్యాంకును వినియోగించుకొని అధికారంలోకి వచ్చిన వైసిపి వారికి తీరని అన్యాయం చేసిందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనెల అప్పారావు అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని ఓడించి తగిన బుద్ధి చెబుతామని అన్నారు. 27 పథకాలను రద్దు చేసి ఎస్‌సి కార్పొరేషన్‌ను మాల, మాదిగ, రెల్లి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను నవరత్నాలకు మళ్లించి, దళితులకు మొండిచేయి చూపారని అన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు రాడ విజయ్‌కుమార్, గుర్రాల చిన్నబాబు, తోట రాము, చిన్నారావు, వి.లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సిఐ ఈశ్వర్ చంద్రప్రసాద్

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపి అనెక మంది ప్రాణాలు కోల్పోయారని సిఐ ఈశ్వర్ చంద్రప్రసాద్ అన్నారు. పట్టణంలో హెల్మెట్ వాడకంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ఉపయోగించాలని సూచించారు. ర్యాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదవాలి



మాట్లాడుతున్న సత్యరాజ్

ప్రజాశక్తి - కంచిలి

ప్రతి విద్యార్థీ క్రమశిక్షణ, పట్టుదల, ఏకాగ్రతలతో విద్యాభ్యాసం చేయాలని, పాఠశాల ఆవరణంలో సోదర భావంతో మెలిగాలని స్ఫూర్తి కల్చరల్ టీం సభ్యుడు సత్యరాజ్ అన్నారు. శుక్రవారం జాడపూడి కెజిబివిలో బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా చట్టాలు, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.వాణికుమారి, రవి, మోహిని, అనురీష, కుసుమ, మురళి, సంగమయ్య, తదితరులు పాల్గొన్నారు.



జలుమూరు : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



నందిగాం : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అవగాహనతోనే క్షయ నివారణ

ప్రజాశక్తి - జలుమూరు

క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉన్నప్పుడే నివారణ సాధ్యమవుతుందని జలుమూరు పిహెచ్‌సి వైద్యాధికారి టి.శ్రీకాంత్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి బారిన పడినవారు వైద్యుల సూచనలు పాటిస్తూ ప్రభుత్వం అందజేస్తున్న మందులు క్రమం తప్పకుండా వినియోగిస్తే వ్యాధి నుంచి సులువుగానే బయటపడవచ్చని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చల్ల వంశీ, ఆరోగ్య సిబ్బంది పద్మావతి, చిన్న రాజులు తదితరులు పాల్గొన్నారు.

నందిగాం: ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులతో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. టిబి ఓడిపోతుంది.. ప్రిన్సిపాల్ ధమయంతి ఆధ్వర్యంలో దేశం గెలుస్తుంది. టిబి నువ్వెంత కృంగిపోకు రవ్వంత. బరువు తగ్గితే పరీక్ష చేయించుకో వంటి నినాదాలు చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

వైసిపి పతనం మొదలైంది



టెక్కలి: కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - కవిటి

ఎమ్మెల్యే కోటాలో ఉత్కంఠభరితంగా సాగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి పి.అనురాధ విజయంతో వైసిపి పతనం మొదలైందని టిడిపి మండలం నాయకులు సీపాన వెంకటరమణ, బెందాళం రమేష్ అన్నారు. అనురాధ గెలుపొందటంతో టిడిపి నాయకులు శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. రామయ్య పుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి కవిటి బస్టాండ్ కూడలిలో కేక్ కట్ చేసి సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపికి విజయాన్ని అందించిన అటు పట్టభద్రులు, ఇటు శాసనసభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. టిడిపి మండల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బి.తిరుమలను నాయకులు అభినందించారు. కార్యక్రమంలో మణి చంద్రప్రకాష్, పొందల కష్ణారావు, సదానంద రౌలో, సంతోష్ పట్నాయక్, బాసుదేవ్ రౌలో, ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, పుల్లట సంతోష్, పుల్లట రాజు, తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: రాష్ట్రంలో వైసిపి అప్రజాస్వామిక పాలనకు ప్రజల చరమగీతం పాడనున్నారని టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచిన నేపథ్యంలో శుక్రవారం పార్టీ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. కేకు కోసి పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు హెచ్.రామకృష్ణ, ఎం.పురుషోత్తం, ఎం.దమయంతి, ఎం.రాము, పి.షణ్ముఖరావు, కాళీ, కె.లవకుమార్, ఆర్.ప్రతీష్‌చంద్, ప్రసాద్‌రెడ్డి, మధు, కామేష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి ప్రభుత్వం కృషి

ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి - ఆమదాలవలస

మహిళా రైతులే మహారాణులని ఎపిఎం పైడి కూర్మారావు అన్నారు. శుక్రవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల సమైక్య కోశాధికారి రేణుకామొహరాన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం ఎక్కువ శ్రద్ధ చూపిస్తోందని అన్నారు. ప్రభుత్వ పథకాలన్నీ మహిళల పేర ఇస్తోందని చెప్పారు. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ ఆధారిత కుటుంబాల్లో జీవనోపాధులను మెరుగుపరుచుకోవడానికి వ్యవసాయంతో పాటు పశుపోషణ, ఉద్యాన, పెరటి తోటల పెంపకం, చిరుధాన్యాల సాగు, ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. సమావేశంలో అకౌంటెంట్ కళ్యాణి, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.



వేలంపాట నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు

రెండేళ్ల తర్వాత తల్లి చెంతకు...



బాలుడిని తల్లికి అప్పగిస్తున్న ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రెండేళ్ల తర్వాత మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం చొరవతో తల్లి ఒడికి బాలుడు చేరాడు. రెండేళ్ల కిందట జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన మహిళ ఉపాధి నిమిత్తం పసిబిడ్డను వదిలి వలస వెళ్లిపోయింది. స్థానికుల సహాయంతో ఆశావర్కర్స్ ఆ శిశువును శ్రీకాకుళం నగరంలోని శిశుగృహంలో చేర్పించారు. జిల్లా బాలల సంక్షేమ సమితి విజ్ఞప్తి మేరకు మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం పోలీసులు తల్లి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. ఎట్టకేలకు మచిలీపట్నంలోని చిలకలపూడిలో ఆమె ఉంటున్నట్లు గుర్తించి, ఇక్కడికి రప్పించారు. బాలల సంక్షేమ సమితి సమక్షంలో తల్లిదండ్రుల వివరాలను నిర్ధారించిన తర్వాత అనాథ శరణాలయంలో ఉంటున్న బాలుడిని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి జి.ఆర్ రాధిక తల్లికి శుక్రవారం అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలుడిని తల్లి చెంతకు చేర్చడంలో కృషి చేసిన ఎహెచ్‌టియు విభాగం పోలీసు సిబ్బందిని ఎస్‌పి అభినందించారు. పోలీసులకు బాలుని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, ఎహెచ్‌టియు విభాగం ఎస్ఐ కేశవరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశీలు వేలంపాట ఖరారు

ప్రజాశక్తి - ఆమదాలవలస

పురపాలక సంఘ పరిధిలోని మార్కెట్ ఆశీల వేలం పాట శంకు శరత్ చంద్రకుమార్‌కు ఖరారైంది. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ కె.అప్పలనాయుడు ఆధ్వర్యంలో మార్కెట్ ఆశీలు, కమేళా పాటకు వేలం నిర్వహించారు. ముందుగా మార్కెట్ ఆశీల పాటకు సర్కారీ వారి పాట రూ.12.60 లక్షలతో ప్రారంభించగా, కాంట్రాక్టరు బొడ్డేపల్లి దాలినాయుడు, శంకు శరత్ చంద్రకుమార్ ఒకరిపై ఒకరు అధిక మొత్తంలో పాటను పాడుతూ చివరకు రూ.19.51 లక్షలకు పాటను శరత్ చంద్రకుమార్ సొంతం చేసుకున్నారు. దీనికి అదనంగా రూ.5.4 లక్షలు స్వీపర్ ఛార్జీలు మొత్తం కలిపి రూ.24.55 లక్షలకు శరత్ చంద్రకు పాటను ఖరారు చేశారు. గత ఏడాది ఇదే మార్కెట్ ఆశీల పాట రూ.10.71 లక్షలకు బొడ్డేపల్లి దాలినాయుడు పాడుకున్నారు. గతేడాదితో పోలిస్తే రూ.9,16,000 అదనపు ఆదాయం మున్సిపాలిటీకి దక్కింది. గొర్రెలు, మేకలు వధించుందుకు కమేళా పాట గత ఏడాది రూ.50,300లకు దుప్పల పద్మావతి దక్కించుకోగా ఈ ఏడాది శరత్ చంద్రకుమార్ రూ.52 వేలకు దక్కించుకున్నారు. చింతాడ వారపు సంత పాటకు ఎవరూ హాజరు కాలేదు. కార్యక్రమంలో కమిషనర్ అప్పలనాయుడు, మేనేజర్ బి.లక్ష్మీనారాయణ, ఆర్ఐ డి.రామారావు, క్లర్క్ కిరణ్మయి, జె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలంటే భయం వద్దు



తాడివలసలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

విద్యార్థులు పరీక్షలంటే సహజంగా ఉండే భయం వీడితేనే మంచి ఫలితాలు సాధించవచ్చని అక్కుపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ దువ్వాడ దివ్య అన్నారు. శుక్రవారం అక్కుపల్లి మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్య మాట్లాడుతూ మొదటి సారి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు సహజంగా భయం ఉంటుందన్నారు. ఇష్టపడి చదివితే ఇటువంటి అవరోధాలను అధిగమించవచ్చు అన్నారు. విద్యార్థి దశలో పదో తరగతి తొలి మెట్టు అన్నారు. ఈ దశలో వేసిన అడుగులు విద్యార్థిని ఉన్నత శిఖరాలకు చేర్చుతుందన్నారు. విద్యార్థులు ఆందోళన చెందకుండా పరీక్షలపై మనసు నిమగ్నం చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.పాపారావు, పలాస ఎంజెపి పాఠశాల ఉపాధ్యాయిని హనుమంతు స్వప్న, వైస్ ప్రిన్సిపాల్ కుమారి, ఉపాధ్యాయులు ఉష, ప్రశాంతి, శ్రీలక్ష్మి, పద్మ, పార్వతి పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

పొందూరు: మండలంలోని తాడివలస జెడ్‌పి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం లఖినాన హేమనాచార్యులు ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు శతశాతం ఫలితాలను సాధించాలని ఆకాక్షించారు. విద్యార్థులు స్వయం కృషితో కష్టపడి జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఆయన కోరారు. అనంతరం విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా డాన్సులు చేస్తూ అలరించారు. లఘు నాటికలు, ఏకపాత్రాభినయంతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

నియంతృత్వ పాలనను అంతమొందించాలి

డిసిసి అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి



ప్రచారం చేస్తున్న బొడ్డేపల్లి సత్యవతి, తదితరులు

ప్రజాశక్తి - ఆమదాలవలస

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న నియంతృత్వ పాలనను ప్రజలు అంతమొందించాలని డిసిసి అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి పిలుపునిచ్చారు. ఎఐసిసి, పిసిసి పిలుపు మేరకు హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా పురపాలక సంఘం పరిధిలోని 8వ వార్డు గేటులో ఇంటింటికీ తిరిగి చేయి చేయి కలుపుదాం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం అంటూ ప్రజలతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంతత్వ పాలనను సాగిస్తూ ప్రతిపక్షాలపై కక్ష సాధింపు తప్ప సామాన్యుల బాగోగులు చూసిన దాఖలాల్లేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత ప్రభుత్వాలు చేపడుతున్న అభివృద్ధికి తేడాను ప్రజలు గమనించాలని కోరారు. కార్యక్రమంలో సీనియరు నాయకులు సనపల అన్నాజీరావు, లఖినేని నారాయణరావు, బస్వా షణ్ముఖరావు, విజయలక్ష్మి, డాక్టర్ లక్ష్మణరావు, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు తగవు

రణస్థలం రూరల్: కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే రాహుల్ గాంధీపై కేసు పెట్టారని కాంగ్రెస్ పార్టీ ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొత్తకోట్ల సింహాద్రినాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బిజెపి అవినీతి, అక్రమాలను రాహుల్ ప్రశ్నిస్తున్నాడనే అక్కసుతో పరువునష్టం దావా కేసులో రెండేళ్లు జైలుశిక్ష పడేలా తీర్పు ఇప్పించారని ఆరోపించారు. తక్షణమే తప్పుడు కేసులను వెనక్కితీసుకోవాలన్నారు. ఆయనతో పాటు కె.లక్ష్మి, ఎ.జగదీష్‌నాయుడు, మీసాల గణేష్, తదితరులు ఉన్నారు.

పౌష్టికాహార ప్రాధాన్యత తెలుసుకోవాలి

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

పౌష్టికాహారం ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఒ శార్వాణి అన్నారు. పోషణ పఖ్వాడలో భాగంగా శుక్రవారం మండలంలోని దేవునల్తడ అంగన్వాడీ కేంద్రంలో పోషణ వేడుకలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం చాలా ముఖ్యమని అన్నారు. తక్కువ ఖర్చుతో లభించే అధిక విలువలున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని సూచించారు. స్థానికంగా లభించే వస్తువులతో తయారయ్యే ఆహార పదార్థాలు, వంటకాలు తయారు చేసి స్థానికులకు రుచి చూపించి, వాటి విలువను తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ధనలక్షమ్మ, ఎంపిటిసి వెంకన్న, సర్పంచ్ వరదరాజు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పొందూరులో 'పోషణ్ పఖ్వాడా'

పొందూరు: పొందూరులోని అంగన్వాడీ కేంద్రం-5, 10లో పోషణ్ పఖ్వాడా కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు తమ్మినేని లక్ష్మి మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలను తినడం ద్వారా బాలింతలకు, గర్భిణీలకు, చిన్నారులకు, కిశోర బాలికలకు రక్తహీనత, లోపపోషణ నివారించవచ్చునని అన్నారు. అనంతరం స్థానికంగా లభించినటువంటి చిరుధాన్యాలతో తయారుచేసిన వంటకాలను, కూరగాయలను, పండ్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు లక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు రమణమ్మ, హైమ, సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న వెంకటరావు

రుణాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పలాస

పిఎసిఎస్ ద్వారా రైతులకు మంజూరైన రుణాలను సద్వినియోగించుకోవాలని, రుణ వాయిదాలను సక్రమంగా చెల్లించాలని పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు అన్నారు. శుక్రవారం కార్యాలయంలో భూ అభివృద్ధి రుణాలకు సంబంధించి రైతులకు రూ.22లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కైజోల గ్రామానికి చెందిన బత్తిన అప్పలస్వామికి రూ.5 లక్షలు, కొత్తూరు గ్రామానికి చెందిన లంబాడ వెంకటమోహన్‌కు రూ.5 లక్షలు, నీలభద్ర గ్రామానికి చెందిన యర్ర వసంతరావుకు రూ.5 లక్షలు, నీలావతి గ్రామానికి చెందిన బొంగు కేధారమ్మకు రూ.7 లక్షలు దీర్ఘకాలిక రుణాలను భూ అభివృద్ధి కోసం మంజూరు చేశామని తెలిపారు. కార్యక్రమంలో సిఇఒ శ్రీనివాసరావు, డిసిసిబి బ్యాంక్ మేనేజర్, సూపర్‌వైజర్, తర్లాకోట సర్పంచ్ కొర్ల సంతు, కేదారిపురం సర్పంచ్ ధనుంజయలతో పాటు రైతులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

శ్రీముఖలింగేశ్వరుని హుండీ లెక్కింపు

జలుమూరు: దక్షిణ కాశీగా పేరుగాంచిన పరిశుద్ధ సవక్షేత్రం శ్రీముఖలింగంలోని లింగేశ్వరస్వామి ఆలయ హుండీని దేవాదాయశాఖ అధికారులు, అర్చకులు, గ్రామస్తులు, కొమనాపల్లి సత్యసాయి సేవా సమితి సభ్యుల సమక్షంలో లెక్కించినట్లు ఆలయ ఇఒ పి.ప్రభాకరరావు తెలిపారు. 115 రోజులకు రూ.4,37,519 వచ్చినట్లు చెప్పారు.

'ఉపాధి' కూలీలు గరిష్ట వేతనం పొందాలి



మాట్లాడుతున్న ఎపిడి శైలజ

ప్రజాశక్తి - జలుమూరు

ఉపాధి హామీ కూలీలు ప్రభుత్వం నిర్దేశించిన కనీస వేతనం రూ.257 పొందేలా చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ సిబ్బందిని ఎపిడి శైలజ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎన్ఆర్ఇజిస్ కార్యాలయంలో ఎపిఒ, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి కూలీలు కనీస వేతనం పొందేందుకు ఆరు నుండి ఎనిమిది గంటలు పనిచేసేలా క్షేత్రస్థాయిలో సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ నెలాఖరు నాటికి 100 రోజులకు దగ్గరగా ఉన్న కుటుంబాలకు వంద రోజులు పని పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎపిఒ పట్ట సోమేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

కంచిలి: మండలంలోని ఎస్ఆరిసి.పురంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సర్పంచ్ ప్రతినిధి డొక్కరి బలరాం శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కూలీలకు కూలి పెరిగేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లను కోరారు. పంచాయితీ పరిధిలో కొత్త పనులకు పరిశీలన చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ బాబురావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల వేలం

ఆమదాలవలస: పట్టణంలోని ఎస్ఇబి కార్యాలయంలో రెండు ద్విచక్ర వాహనాలకు శుక్రవారం జరిగిన వేలంపాటలో దవళ అప్పలనాయుడు, బొడ్డేపల్లి విజయ్‌కుమార్ వాటిని దక్కించుకున్నారు. ఈ వేలంలో 16 మంది పాల్గొన్నట్లు ఎస్ఇబి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.సునీల్‌కుమార్ తెలిపారు. వేలంపాటలో పాల్గొని ద్విచక్ర వాహనాలను దక్కించుకున్న వ్యక్తులు బిడ్ అమౌంట్, అప్సెట్ వ్యాల్యూ, గ్రోత్ వ్యాల్యూ, జిఎస్‌టిలతో కలిపి మొత్తం రూ.85,078కు వాహనాలను దక్కించుకున్నారని తెలిపారు.

పనితీరు మెరుగుపర్చుకోకుంటే చర్యలు

ఇచ్ఛాపురం: గ్రామ, సచివాలయ సిబ్బంది పనితీరు మెరుగుపర్చుకోకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పవని ఎంపిడిఒ కె.రామారావు హెచ్చరించారు. శుక్రవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. బిర్లంగి గ్రామ సచివాలయంలో సిబ్బంది పని తీరుపై సమీక్ష నిర్వహించారు. రికార్డుల పరిశీలన, తాగునీటి సమస్యలపై తీసుకుంటున్న చర్యలు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయంలో సిబ్బంది గైర్హాజరుపై మెమో జారీ చేశారు. అనంతరం మశకాపురంలో చెరువులో చేపట్టిన ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి అందుతున్న కూలి గురించి తెలుసుకున్నారు. బిర్లంగి ఎంపిపి పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ రామారావు